స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 29: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు భారీగా తరలి రావడంతో మంత్రాలయం కిక్కిరిసింది. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ పల్లకిలో రాఘవరాయడి బృందావన ప్రతిమను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఘనంగా ఊరేగించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖ ద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో పూజ సామగ్రికి, ప్రైవేట్ లాడ్జిలకు డిమాండ్ పెరిగింది.

గ్రేడ్-2 వీఆర్వోలకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 29: జిల్లాలోని గ్రేడ్-2 వీఆర్వోలకు శుక్రవారం రెవెన్యూ అధికారులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు 70 మంది గ్రేడ్-2 వీఆర్వోలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం డీఆర్వో కార్యాలయంలోని ఉమ్మడి జిల్లా అధికారులతో కర్నూలు ఆర్డీవో మధుసూదన్‌రావు బదిలీల కౌన్సెలింగ్‌పై చర్చించారు. కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ నుంచి ఆఫీసు సబార్డినేట్స్ వరకు కర్నూలు నుంచి నంద్యాలకు 16 మంది, నంద్యాల నుంచి కర్నూలుకు 48 మంది, మ్యూచువల్ ఆరుగురు, రిక్వెస్టు బదిలీలకు 42 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వైద్య శాఖ ఉద్యోగులకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 29: ఈ నెల 30న వైద్య ఆరోగ్య శాఖలో 99 మంది పీహెచ్ఎన్ నాన్ టీచింగ్‌లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా పలుకూరు పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎం.గంగ నాగేశ్వరి సీహెచ్‌వోగా పదోన్నతి జాబితాలో ఉన్నారు. కడప జోన్-4 పరిధిలో 18 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సూపర్‌వైజర్ ఫీమేల్‌గా పదోన్నతుల కౌన్సెలింగ్ ఈ నెల 31న కడప ఆర్‌డీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీ డా.వై.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి పి.అరుణ కుమారి (నున్నిపెంట) బి.శారద (ఉప్పలపాడు) బి.భాగ్యమ్మ (పర్ల), జే స్వర్ణలత (కొత్తబురుజు), బి.మంగమ్మ (హొళగుంద), ఎస్. కొత్తురమ్మ(కృష్ణగిరి)లకు పదోన్నతులు లభించనున్నాయి. ఈ నెల 30న పది మంది సీనియర్ అసిస్టెంట్లకు ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పదోన్నత్తులు లభించనున్నాయి. బాలస్వామి (ఆస్పరి), రాజు (సీ.బెళగల్), సాయి ప్రసాదరావు (జిల్లెల), కె.శ్రీనివాసులు (ఆర్‌టీసీ మేల్), పదోన్నతుల జాబితాలో ఉన్నారు. కడప జోన్-4 పరిధిలో పని చేస్తున్న నలుగురు సీనియర్ హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా పదోన్నతులు లభించనున్నాయి. కర్నూలు నుంచి కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న సీనియర్ హెడ్ నర్సు జి.విమలమ్మకు నర్సింగ్ గ్రేడ్-2గా పదోన్నతి లభించనుంది

గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 29: నంద్యాల జిల్లా బండిఆత్మకూరుకు చెందిన ఓ గర్భిణికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ వైద్యులు ప్రసవంతోపాటు కడుపులో ఉన్న పెద్ద గడ్డలను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. గురువారం గైనిక్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఈ అరుదైన శస్త్ర చికిత్స గురించి వివరించారు. బండి ఆత్మకూరుకు చెందిన గర్భిణిని కాన్పు కోసం నంద్యాల, నందికొట్కూరు, కర్నూలులోని చాలా హాస్పిటల్స్‌ను తీసుకెళ్లినా వైద్యులు ముందుకు రాకపోవడంతో ఈ నెల 13న కర్నూలు జీజీహెచ్‌కు వెళ్లారు. అక్కడ ఆమెకు వైద్యులు పరీక్షలు చేయగా.. గర్భంతోపాటు కడుపులో రెండు పెద్ద గడ్డలు కూడా పెరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నెల 20వ తేదీన గైనిక్ యూనిట్-1 చీఫ్ డా. శ్రీలక్ష్మి అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నర్మద, పీజీలు, అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. మురళి ప్రభాకర్ బృందం గర్భిణికి ప్రసవంతోపాటు గడ్డలను తీసి ప్రాణాన్ని కాపాడారు. ఈ సందర్భంగా గైనిక్ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ అరుదైన శస్త్ర చికిత్సను వైద్యపరి భాషలో సిజేరియన్ మయోమార్టమి అంటారని తెలిపారు. ఒక గడ్డ రెండు కేజీలు, మరో గడ్డ 800 గ్రాములు ఉన్నాయని వివరించారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీకి నేడు కౌన్సెలింగ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు శుక్రవారం బదిలీలకు సంబంధించి ఫిజికల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌టీబీసీ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులు జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులను బట్టి ప్రత్యేకంగా అధికారులను నియమించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శులకు రెవెన్యూ అధికారి కేఎండీ జునైద్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు మేనేజర్ చిన్నరాముడు, వెల్ఫేర్ కార్యదర్శులకు టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ కార్యదర్శులకు ఎంహెచ్‌ఓ కే విశ్వేశ్వరరెడ్డి, అమ్యూనిటీస్‌కు డీఈఈ రాజశేఖర్, ప్లానింగ్ కార్యదర్శులకు డీసీపీ సంధ్య బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సిల్ హాలులో కావాల్సిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఈలు రవిప్రకాష్ నాయుడును ఆదేశించారు.

రేపటి నుంచి గూటుపల్లె ఉరుసు

31న గంధోత్సవం, సెప్టెంబరు 1న ఉరుసు

బేతంచెర్ల, ఆగస్టు 29: మండలంలో మత సామరస్యానికి ప్రతీక అయిన గూటుపల్లి ఉరుసు ఈ నెల 31న ప్రారంభం కానుంది. సెప్టెంబరు 1న ఉరుసు, 2న జియారత్ జరుగుతాయి. గూటుపల్లెలో వెలసిన హజరత్ సయ ద్‌షా అబ్దుల్ రెహిమాన్ ఇద్రూస్ బాషా ఉరఫ్ పెద్దరాజుల స్వామి ఉరుసు మతసామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధి చెందింది. ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి దర్గాను దర్శించుకుని ఫతేహాల్ సమర్పించుకుంటారు. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా నిర్వాహకుడు గురు సయ్యద్ షా బాషా ఖాద్రి గురువారం తెలిపారు



ముస్తాబైన పెద్దరాజుస్వామి దర్గా

వారణాసికి వృద్ధుడి పాదయాత్ర

- ఫిబ్రవరి నుంచి 2,800 కి.మీ. నడక
- మంత్రాలయానికి చేరుకున్న భక్తుడు గోపాలకృష్ణ



పాదయాత్ర పూర్తి చేసుకున్న వృద్ధుడిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు


మంత్రాలయం, ఆగస్టు 29: కర్ణాటక సిరిగుప్ప గ్రామానికి చెందిన వృద్ధుడు గోపాలకృష్ణ (68) వారణాసికి 2,800 కి.మీ. పాదయాత్ర చేసి గురువారం మంత్రాలయానికి చేరుకున్నాడు. ఆర్యవైశ్య సత్రం సిబ్బంది ఆయనను సన్మానించారు. వారణాసి కాశీవిశ్వనాథ స్వామి దర్శనార్థం ఫిబ్రవరి 22వ తేదీన సిరిగుప్ప నుంచి బయలుదేరి పండరీపురం, ఉజ్జయిని, మహాకాళేశ్వర్, షిరిడీ, త్రయంబకేశ్వర్, ప్రయాగ మీదుగా వారణాసికి చేరుకున్నాడు. రోజుకు 15 కి.మీ. ప్రకారం నడిచి, ఆగస్టు 15న వారణాసి చేరుకుని 9 రోజులు పూజలు చేశాడు. అక్కడి నుంచి భక్తుల సహకారంతో విమానం ద్వారా బెంగళూరుకు చేరి అనంతరం మంత్రాలయానికి చేరుకున్నాడు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

వెలుగోడు, ఆగస్టు 29: వెలుగోడు అబ్దుల్లాపురం రహదారిలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వెలుగోడు పట్టణానికి చెందిన మహేష్ తన వ్యక్తిగత పనులపై అబ్దుల్లాపురం గ్రామానికి బయలు దేరాడు. వెలుగోడుకు చెందిన రామాంజనేయులు వేల్పనూరుకు వెళ్లి తిరిగి వెలుగోడుకు బైక్‌పై బయలు దేరాడు. ఈ రెండు వాహనాలు వెలుగోడు- అబ్దులాపురం గ్రామాల మధ్య ఢీకొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు (36) అక్కడి క్కడే మృతి చెందగా మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్‌కు వెలుగోడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. రామాంజనేయులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

రేపు పత్తికొండకు సీఎం

- పుచ్చకాయలమాడ గ్రామంలో పింఛన్ల పంపిణీ
- ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు





ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

షెడ్యూల్ ఇలా..

- శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు కర్నూలు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు.
- 12.40 గంటలకు హెలికాప్టర్‌లో పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి బయలుదేరుతారు.
- 1:05 గంటలకు పుచ్చకాయలమాడ గ్రామం చేరుకుంటారు.
- 1:20 గంటల నుంచి 1:50 గంటల వరకు గ్రామంలో ఇంటింటి పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్తారు. కాలినడకన గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు.
- 2:05 నుంచి 3:05 గంటల వరకు ఆలయ సమీపంలో పుచ్చకాయలమాడ గ్రామస్థులతో నిర్వహించే గ్రామసభలో పాల్గొని వారితో ముఖాముఖి మాట్లాడతారు.
- 3:15 హెలికాప్టర్‌లో బయలుదేరి 3:40కి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లిపోతారు.

పత్తికొండ, ఆగస్టు 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పత్తికొండ పర్యటనకు రానున్నారు. పత్తికొండ మండలం పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హైస్కూల్ సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో శివాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ నవ్య గురువారం సాయంత్రం గ్రామానికి చేరుకొని హెలిప్యాడ్, గ్రామ సభ ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద, గ్రామంలో ఎలాంటి భద్రత ఏర్పాట్లు ఉండాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు. పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. పత్తికొండ మండల పరిషత్ సమావేశంలో కలెక్టర్, ఎస్పీలు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం 12 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పుచ్చకాయలమాడకు చేరుకుంటారని అన్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో పింఛన్‌దారుల ఇళ్లకు చేరుకుంటారని, అక్కడి నుంచి గ్రామ సభకు వెళ్తారని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందని, ఆయన గ్రామంలో పర్యటించే సమయంలో ప్రజలు, పార్టీ నాయకులు పోలీసులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, ఆర్డీవో రామలక్ష్మీ, డీఎస్పీ వెంకట్రామయ్య, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సీఐలు జయన్న, పులిశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

యువత ధ్యాన్‌చంద్ స్ఫూర్తిని పొందాలి

ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జేసీ

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 29: మేజర్ ధ్యాన్‌చంద్ సాధించిన విజయాలతో యువత స్ఫూర్తి పొందుతూ క్రీడల్లో ఉన్నత స్థానాల్లో రాణించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పేర్కొన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించి వారిని గౌరవించుకుంటున్నామని అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా అవుట్‌డోర్ స్టేడియంలో ఆయన విగ్రహానికి ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నవ్య, డీఎస్‌డీవో భూపతిరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సెట్కూరు సీఈవో పీవీ రమణ, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు రామాంజనేయులు, అధికారులు, క్రీడా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు

పార్లమెంటులో తెలుగులో మాట్లాడే అవకాశం దక్కింది

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



ఎంపీ నాగరాజును సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 29: పార్లమెంటులో తెలుగులో మాట్లాడే అరుదైన అవకాశం తనకు దక్కిందని, అందుకు ఎంతో సంతోషంగా ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. వారు తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తెలుగు భాష ఒక సుసంపన్నమైన భాష అని, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషదాయకమని అన్నారు. అనంతరం తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ, కవులు మారేడు రాముడు, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తొగట సురేష్‌బాబు, అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్షలను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కూచిపూడి నృత్యగురువు కరీముల్లా, కళాకారులు యాగంటీశ్వరప్ప, బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, చంద్రకంటి మద్దయ్య, లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి పరిమితులు ఉన్నాయి

బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 29: పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రజల జీవనాడి అని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నదని, వాస్తవానికి ఆ ప్రాజెక్టుకు అనేక పరిమితులు ఉన్నాయని సాగునీటి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి హాస్పిటల్ సమావేశ హాలులో సాగునీటి నిపుణులతో సమావేశం జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ 2015 జూన్ 18, 19తేదీల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన లెటర్ ఆధారంగా చూసినప్పుడు కృష్ణా డెల్టాకు వాడుకోవాల్సిన నీళ్ల నాగార్జున సాగర్ డౌన్ స్ట్రీమ్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, గాలేరు, మున్నేరు, మూసీల నుంచీ 100 టీఎంసీలను వాడుకోవాల్సి ఉంటే, ఆ ప్రాంతం 20 టీఎంసీలు మాత్రమే తీసుకోగలుగుతున్నదని, మిగతా నాగార్జున సాగర్ నుంచి తీసుకునేలా ఆ లేఖలో పొందుపరిచారని చెప్పారు. దీని వల్ల కృష్ణా డెల్టాకు చట్టబద్ధంగా అలాట్ చేసిన వంద టీఎంసీల నీటిని నిలబెట్టుకోవడానికి రిజర్వాయర్ లేకపోవడం వల్ల ఆ నీటినంతా సముద్రంపాలు చేస్తూ మిగిలిన నీటినంతా నాగార్జున సాగర్ నుంచో, శ్రీశైలం ప్రాజెక్టు నుంచీ తీసుకురావడం వల్ల ఇటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు, లేదా రాయలసీమకు అన్యాయం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలోని సాగు భూమిలో రాయలసీమ 42 శాతం భూభాగం ఉన్నందు వల్ల సాగు నీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులను సీమ సాగు నీటికి ఖర్చు పెట్టాలన్నారు.

పోలీసులకు ఎస్పీ అభినందనలు

కోవెలకుంట్ల, ఆగస్టు 29 : మద్యం మత్తులో లారీ నడుపుతున్న డ్రైవరు నుండి ప్రజల ప్రాణాలను కాపాడిన ఇద్దరు పోలీసులను ఎస్పీ ఆది రాజ్‌సింగ్ రాణా అభినందించి వారికి రివార్డు ప్రకటించారు. సీఐ హనుమంతనాయక్ తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన పేరం సుదర్శన్‌రెడ్డి మద్యం తాగి బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో సిమెంటు లోడు ఉన్న 12 టైర్ల పెద్ద లారీని బనగానపల్లె నుండి ఆళ్లగడ్డకు డ్రైవ్ చేస్తుండగా కోవెలకుంట్ల పట్టణంలోని అంకాలమ్మ గుడి వద్ద కానిస్టేబుల్ ఇంతియాజ్ హుసేన్, సుధాకర్ గమనించారు. లారీ డ్రైవరును అదుపులోకి తీసుకుని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వద్దకు తీసుకుని వచ్చారు. ఎస్ఐ కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టులో డ్రైవరును హాజరుపరిచారు. న్యాయాధికారి షేక్ అబ్దుల్ రహిమాన్ సదరు లారీ డ్రైవరుకు 30 రోజులు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవరు బారి నుంచి ప్రజలను కాపాడిన కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.

మద్యం మత్తులో దాడులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 29: నంద్యాలలో మద్యం మత్తులో కత్తులతో దాడులకు తెగబడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మలసత్రంలో బుధవారం అర్ధరాత్రి అదే ఏరియాకు చెందిన ప్రకాష్, సుబ్బరాయుడు మద్యం సేవించి వాగ్వాదానికి దిగారు. సుబ్బరాయుడు తన వద్ద ఉన్న కత్తితో ప్రకాష్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయలు కావడంతో స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలంచారు. అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో గొంతు కోసి పరార్

నంద్యాల పట్టణ శివార్లలోని కేసీ కెనాల్ గట్టుపై ఇద్దరు యువకులు గురువారం మద్యం తాగి ఘర్షణపడ్డారు. విశ్వనగర్‌కు చెందిన బుజ్జి తన వద్ద ఉన్న కత్తితో నందమూరి నగర్ షేక్ బషీర్‌పై దాడి చేసి పరారయ్యారు. గాయపడ్డ బషీర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: ఉమ్మడి జిల్లాలోని నగర పాలక, మున్సిపాలిటీల కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబును నియమించారు. ప్రస్తుతం ఆయన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోస్టింగ్ కోసం వేచి ఉన్న వి.మల్లికార్జునను ఆదోని కమిషనర్‌గా, రెవెన్యూ ఆఫీసర్ గ్రేడ్-3 ఎస్.బేబిని నందికొట్కూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ టి. సుధాకర్‌రెడ్డిని మాతృ సంస్థ ఆడిట్ శాఖలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా నందికొట్కూరు మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణారెడ్డిని కడప మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ఎం.మంజులత గౌడును నందికొట్కూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ కమిషనర్ ఎల్.రమేష్‌బాబును నగర పాలక సంస్థ సూపరింటెండెంట్‌గా నియమించారు. అయితే ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఆయనను బేతంచెర్ల కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.హరిప్రసాద్‌ను డీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అనంతపురం జిల్లా గుత్తి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాసులును కర్నూలు నగర పాలక సంస్థకు కేటాయించి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మున్సిపాలిటీకి కమిషనర్‌గా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఆగస్టు 29: మండలంలోని వంకమిట్టపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు(40) మృతి చెందాడు. అనంతపురం యాడికి మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన నాగరాజు బైకుపై స్థానిక మండలంలోని కంబగిరిస్వామి దేవస్థానానికి వచ్చాడు. దైవ దర్శనం కాగానే తిరిగి సొంత ఊరికి బయలుదేరాడు. వంకమిట్టపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ఘటనలో నాగరాజు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల పోలీసులు తెలిపారు.

కల్లూరును వీడని ఘనుడు

- కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు బేఖాతర్
- ఇక్కడే వీఆర్వోగా కొనసాగుతున్న మద్దిలేటి
- ఆదేశాలు అమలు చేయడంలో తహసీల్దారు విఫలం



అగస్టు 13వ తేదీన కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు

కల్లూరు, ఆగస్టు 29: ఆ అవినీతి ఘనుడు కల్లూరును వీడడం లేదు. కలెక్టర్ బదిలీ ఉత్తర్వులను సైతం లెక్క చేయడం లేదు. కల్లూరు వీఆర్వో మద్దిలేటి అవినీతి ఆరోపణలపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సదరు వీఆర్వోను కలెక్టర్ ఆదేశాలతో ఆగస్టు 13న డిప్యుటేషన్‌పై దేవనకొండ మండలానికి బదిలీ చేస్తూ డీఆర్వో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నేటికీ అతను ఇక్కడి నుంచి రిలీవ్ కాకుండా కల్లూరులోనే కొనసాగుతుడడం పలు అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణ చర్యల ఉత్తర్వులను తహసీల్దార్ తుంగలో తొక్కడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నేతల సిఫారసుతో ఆపుకున్నాడట..

కల్లూరు వీఆర్వోగా పని చేస్తున్న మద్దిలేటి అనేక అక్రమాలకు పాల్పడినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ, దేవాలయ, వాగు పోరంబోకు, వక్ఫ్‌బోర్డు భూములను దోచిపెట్టారని అతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే కర్నూలు నగరంలో ఖరీదైన డాక్టర్స్ కాలనీలో 11 సెంట్ల స్థలం కొని ఐదు సెంట్లలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నాలుగు అంతస్తుల భవనం నిర్మించారనే వార్త చక్కర్లు కొట్టింది. అనేక ఆరోపణల నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో అవినీతి ఘనాపాటి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి కర్నూలు ఆర్డీవోను విచారణకు ఆదేశించారు. వీఆర్వో మద్దిలేటిపై విచారణ జరిపిన ఆర్డీవో నివేదికను కలెక్టరుకు అందజేశారు. దీంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆగస్టు 13న సదరు వీఆర్వోను దేవనకొండ మండలం తెర్నేకల్-2కు డిప్యూటేషన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఆర్వో మధుసూదన్‌రావు కల్లూరు తహసీల్దారు కార్యాలయానికి ఉత్తర్వులు పంపి కలెక్టర్ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. అయితే కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి 17 రోజులైనా బదిలీ ఉత్తర్వులను అమలు చేయడంలో కల్లూరు తహసీల్దారు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉంటే వైసీపీ నేతల సిఫారసుతో బదిలీ కాకుండా చేసుకున్నట్లు తోటి ఉద్యోగులతో సదరు వీఆర్వో చెప్పుకుంటుండటం గమనార్హం.

ఈ విషయంపై తహసీల్దారు కె.ఆంజనేయులును వివరణ కోరగా వీఆర్వో రెగ్యులర్ ట్రాన్స్‌ఫర్‌లో బదిలీ అవుతాడని చెప్పారు. రెండు రోజులు ఆగితే రెగ్యులర్ బదిలీల్లో ఇక్కడి నుంచి వెళ్లిపోతాడన్నారు. ఇదే విషయంపై నాలుగు రోజుల ముందు కూడా తహసీల్దారును అడగ్గా రికార్డులు హ్యాండోవర్ చేయగానే రిలీవ్ చేస్తామని చెప్పడం కొసమెరుపు.

తెలుగు భాషను రక్షించుకుందాం

కర్నూలు(అర్బన్), ఆగస్టు 29: తెలుగును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ రచయిత, కవి డాక్టర్ బీవీ స్వరూప్ సిన్హా అన్నారు. గురువారం ఉస్మానియా కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ అజ్రాజావేద్ మాట్లాడుతూ ఉస్మానియా కళాశాలలో అన్ని భాషలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా స్వరూప్ సిన్హా మాట్లాడుతూ తెలుగు భాషను కాపాడుకోవడం ఒక ముఖ్యమైన ఉద్యమం కావాలని అన్నారు.

● **కేవీఆర్‌లో..** వాడుక భాష కోసం గిడుగు రామ్మూర్తి పంతులు ఎంతో శ్రమించారని లని తెలుగుశాఖ వికాసం అధ్యక్షుడు జెఎస్ఆర్‌కే శర్మ అన్నారు. గురువారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్‌జీ ప్రమీల ఆధ్వర్యంలో జరిగింది.

● **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..** నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగుభాషకు జీవద్భాష గౌరవాన్ని కల్పించిన గిడుగు సేవల్ని విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత ఇనాయతుల్లా అన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుబాష, జాతీయ క్రీడల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గిడుగు రామమూర్తి, హాకీ క్రీడా కారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు



కోడుమూరు మండలం అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో..



ఉస్మానియా కళాశాలలో విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం



కేవీఆర్ కళాశాలలో మట్లాడుతున్న తెలుగుభాష వికాసం అధ్యక్షుడు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఇనాయతుల్లా

ఖాళీలు భర్తీ చేయాలి: డీవైఎఫ్ఐ



జేడీకి వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: జిల్లాలోని పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 25 పశువైద్యశాలలు శిథిలావస్థకు చేరాయని, వాటి కూల్చి వేసి కొత్తవి నిర్మించాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు-300, పారా వెటర్నరీ పోస్టులు-600, సబార్డినేట్ పోస్టులు 1822 ఖాళీగా ఉన్నా యన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నగర సహాయ కార్యదర్శి హుస్సేన్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా టీడీపీ

కర్నూలు(అర్బన్), ఆగస్టు 29: నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనం రూ. 25 వేలు పెంచి టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని జాతీయ నాయీ బ్రాహ్మణ సవితా సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఆలయాల్లో పని చేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25వేల కనీస వేతనం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రక్షణ చట్టాన్ని త్వరగా అమలుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. క్షరశాలలో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ కల్పించాలని కోరారు, ఈ సమావేశంలో రఘు, రాఘవేంద్ర, శివ, ఉదయ్ ప్రతాప్, నరేంద్ర, గిడ్డయ్య పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: మునగాలపాడు గ్రామ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి కమిషనర్‌కు లేఖ రాశారు. సర్వే నెంబరు 120(పి) 5 ఎకరాలు, సర్వే నెంబరు 91/3ఎ, 91/3సిలో 4.75 ఎకరాలు, 119(పి)లో 8.68 కలిపి మొత్తం 18.43 ఎకరాలలో అక్రమంగా లేఅవుట్లను వేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. సమ్మర్ స్టోరేజీ సమీపంలో జరుగుతున్న పనులను ఆపాలని ఆయన కోరారు.

మేజర్ ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 29: మేజర్ ధ్యాన్ చంద్ సేవలు చిరస్మరణీయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. డీఎస్ఏ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, క్రీడాదాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, సెట్కూరు సీఈవో రమణ, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 29: గత ఐదు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్టల్ నర్సింగ్ కాలేజీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎదుట కర్నూలు పట్టణ పౌర సంక్షేమ సంఘం సభ్యుడు ఎద్దుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 29: పేద అర్చకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు న్యాయం చేశారని బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం నగరంలో కేసీ కెనాల్ సమీపంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో, సండేల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు బ్రాహ్మణ సంఘా నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి దేవదాయ శాఖ సమీక్షలో ఆలయాల అర్చకులకు ప్రస్తుతం ఉన్న వేతనం రూ.10 వేల నుంచి 15 వేలకు పెంచడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ కర్నూలు పార్లమెంటరీ అధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ, అర్చక పురోహిత సంఘం నాయకులు కంచుగంటల శ్యామసుందర శర్మ, చెట్కూరు కోటేశ్వరరావు, నన్నూరు పరమేశ్వర శర్మ, కొణిదెల ప్రసాద శర్మ పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

కర్నూలు (స్పోర్ట్స్), ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలకు విద్యాశాఖ ప్రవేశ పెట్టిన స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు-2024 కార్యక్రమాన్ని గురువారం ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు రూరల్, అర్బన్ మండల విద్యాశాఖ అధికారులు కే.వినోద్ కుమార్, విజయ కుమారిలు హాజరయ్యారు.

క్రీడాకారులకు టీజీ వెంకటేశ్ అభినందన



జాతీయ హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 29: హ్యాండ్‌బాల్ కర్నూలు డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని కర్నూలు జిల్లా నుంచి రాజస్థాన్‌లో జరిగిన 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో మూడో స్థానం సాధించిన కర్నూలు జిల్లా క్రీడాకారులైన జగదీష్, రియాజ్, అభిలతోపాటు స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు సాగర్, భువనేష్‌లను గురు వారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తన నివాసంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో వైద్య శిబిరం

కర్నూలు, ఆగస్టు 29: ప్రతి ఒక్క పోలీసు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని హెడ్ క్వార్టర్స్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్ క్యాంపును ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమమే ముఖ్యమన్నారు. ఈ క్యాంపులో 200 మందికి పైగా పోలీసులు ఆరోగ్య వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మెడికవర్ హాస్పిటల్, క్రౌన్ డెంటల్, శ్రీబాలసాయి ఐ హాస్పిటల్, లయన్స్ క్లబ్ అసోసియేషన్ డాక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఇకో, బీఎండీ, పీఎఫ్‌టీ, బీఎంఐ, డెంటల్, హియరింగ్ టెస్టు, కంటి చూపు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జె బాబు ప్రసాద్, కృష్ణమోహన్, పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోరా..?

» సమావేశానికి గైర్హాజరవుతారా..

» మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ ఆవేదన

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 29: జిల్లాలో మత్స్య కార్మికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద లబ్ధి పొందేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ కోరారు. మత్స్య కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందు కోసం గురువారం జిల్లా మత్స్య సహకార సంఘం యూనియన్ కార్యాలయంలో సమావేశాన్ని డైరెక్టర్లతో ఏర్పాటు చేశామని, అయితే.. ఈ సమావేశానికి రావాలని మత్స్య శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినా రాకపోవడం దారుణమని విలేకరుల సమావేశంలో నవీన్ తెలిపారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడుతో పాటు వైస్ చైర్మన్ పెద్దవీరేష్, డైరెక్టర్లు పోతుల శేఖర్, నాగేష్, మల్లీశ్వరుడు, పాత కోట వెంకటేశ్వర్లు, మద్దిలేటి పాల్గొన్నారు.

సీఐని కలిసిన ముస్లింలు



సీఐకి పూలబొకే ఇస్తున్న ముస్లిం నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 29: కర్నూలు రూరల్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీఐ చంద్రబాబు నాయుడును హుశేనాపురం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహబూబ్ బాషా గురువారం పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కోడుమూరు సీఐ తబ్రేజ్

గూడూరు/సి.బెళగల్, ఆగస్టు 29: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. గురువారం గూడూరు, సి.బెళగల్ పోలీస్‌స్టేషన్లలో వినాయక సేవా సమితి సభ్యులతో సీఐ, ఎస్ఐ తిమ్మయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు, వినాయక సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమంలో గౌరు దంపతుల పూజలు



గౌరు దంపతులను సత్కరిస్తున్న హిమాలయ గురూజీ

కల్లూరు, ఆగస్టు 29: కల్లూరు మండలం చిన్నటేకూరు శాంతి ఆశ్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. గురువారం ఆశ్రమానికి చేరుకున్న గౌరు దంపతులు హిమాలయ గురూజీ ఆశీస్సులు తీసుకుని సమీపంలోని గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురూజీ గౌరు దంపతులను శాలువాలతో సత్కరించి మహా విష్ణువు విగ్రహాన్ని బహూకరించారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

ఆర్జేడీకి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 29: నగరంలోని సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కడప జూనియర్ కళాశాలల ఆర్జేడీ రవికుమార్ నాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. పేద విద్యార్థుల అర్ధాకలితో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కాబట్టి తిరిగి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అమర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి అక్రమ కట్టడాల తొలగింపు

ఓర్వకల్లు, ఆగస్టు 29: ఓర్వకల్లులో వైసీపీ నాయకుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టిన గోడలను గురువారం అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ ఆక్రమణపై గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ సునీల్ కుమార్, వీఆర్వో కృష్ణదేవరాయలు, సర్వేయర్ జయరాముడు పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమ కట్టడాలను తొలగించారు. ఎస్సీ బాలికల వసతి గృహం సమీపాన గల సర్వే నెంబరు 202లో రెండెకరాల 75 సెంట్ల భూమి ఉంది. అందులో రూ. కోటి విలువ చేసే ఎకరా ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకుడు శంకర్ రెడ్డి ఆక్రమించి గోడలు కట్టాడు. ఈ నిర్మాణాలను అధికారులు ఎక్స్‌కవేటర్‌తో గోడలను కూల్చివేశారు. తమకు నోటీసులు ఇవ్వకుండా గోడలు తొలగించడం ఏమిటని శంకర్ రెడ్డి, ఆయన భార్య నాగేశ్వరమ్మ అధికారులను నిలదీశారు. ప్రభుత్వ భూమికి నోటీసులు ఇవ్వమని అధికారులు తేల్చి చెప్పారు.



ఎక్స్‌కవేటర్ ద్వారా అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



రెవెన్యూ శాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: నగరంలోని 20వ వార్డులో పేదలు నివాసం ఉంటున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్య వర్గసభ్యుడు ఆవుల శేఖర్ కోరారు. గురువారం విజయవాడలోని సచివాల యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ నాయకత్వంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 20వ వార్డులో సర్వేనెంబరు 123లో 350 కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని, బి.తాండ్రపాడు గ్రామ పరిధిలో సుమారు 600 కుటుంబాలు నివాస ముంటున్న పట్టాలు లేవన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు లెనిన్‌బాబు, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో

కోడుమూరు(రూరల్), ఆగస్టు 29: సెప్టెంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల సొమ్ము ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. నెలారంభం ఆదివారం కావడం చేత, ఆగస్టు 31నే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

● **పేదల పెన్నిధి చంద్రబాబు:** సెప్టెంబరు నెలలో ఒకరోజు ముందుగా పింఛన్ల పంపిణీ చేపట్టడం గర్వించదగ్గ విషయమని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు పేదల పెన్నిధిగా ప్రజల మనసుల్లో నిలిచిపోతారని అమడగుంట్ల వెంకటేశ్వర్లు, గోరంట్ల తిరుమలనాయుడు, అనుగొండ బంకు గిడ్డయ్య, ప్యాలకుర్తి ఉగాది వెంకటేశ్వర్లుయాదవ్, రంగన్నయాదవ్, రాఘవేంద్ర యాదవ్, ఆరీఫ్, ఉస్మాన్, యూసుఫ్ తెలిపారు.

1న ఖోఖో జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 29: స్థానిక డీఎస్ఏ స్టేడియంలో సెప్టెంబరు 1న కర్నూలు, నంద్యాల జిల్లాల సబ్ జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా పంగులూరులో సెప్టెంబరు 20,21, 22 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి: ఏవో



కందిపంటను ఈకేవైసీ చేస్తున్న ఏవో మల్లేష్‌కుమార్

సి.బెళగల్, ఆగస్టు 29: ప్రతి రైతు ఈ కేవైసీ తప్పనిసరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు తెలిపారు. గురువారం మండలంలోని కొండాపురం, ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాలలో ఎంఈవోలు చేస్తున్న ఈకేవైసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈకేవై తప్పనిసరి చేసుకోవాలన్నారు. ఎంపీఈవోలు అందుబాటులో లేరని రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు. ఏవో వెంట ఆయా గ్రామాల ఎంపీఈవోలు రైతులు ఉన్నారు.

స్వర్ణ రథంపై మల్లన్న



స్వర్ణ రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, ఆగస్టు 29: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున మల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7:30 గంటలకు స్వర్ణరథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామీజీ, స్వర్ణరథం దాత, నెల్లూరు జిల్లా కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లు ఆశీనులైన స్వర్ణరథం ఆలయ మాడవీధుల్లో అశేష భక్తజనం నడుమ వైభవంగా జరిగింది. స్వర్ణరథం ఎదుట కోలాటం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తలను ఆకట్టుకుంది. స్వర్ణ రథోత్సవం భద్రతా ఏర్పాట్లను స్థానిక సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న పర్యవేక్షించారు.

జగనన్న కాలనీలో అవినీతిపై విచారణ చేపట్టండి

ఓర్వకల్లు, ఆగస్టు 29: జగనన్న కాలనీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని టీడీపీ నంద్యాల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గురువారం మంగళగిరిలోని రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో అనర్హులకు ఇళ్లను మంజూరు చేశారని, వాటిలో కూడా విక్రయాలు జరిగాయని, వాటిపై విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు.



రెవెన్యూ శాఖ మంత్రి కి సమస్యను వివరిస్తున్న మల్లెల రాజశేఖర్

బాల్యవివాహాలు చేస్తే జైలుకే



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

సి.బెళగల్, ఆగస్టు 29: బాల్యవివాహాలు చేస్తే జైలుకు వెళ్తారని వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలకు, ఆశా వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు చేస్తే జరిగే నష్టాల గురించి వైద్య సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు రైతు బజారుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 29: కర్నూలు నగరంలోని సీ. క్యాంపు రైతుబజారులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతులు శుక్రవారం కూరగాయలను రైతుబజారుకు తీసుకురావద్దని వారు విజ్ఞప్తి చేశారు.

వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు


ఆదోని నెహ్రూ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఎమ్మిగనూరులో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

● ఆదోని, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 29: నియోజకవర్గంలోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో, ఆర్ఆర్ బేలబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో, పెద్ద తుంబలం జడ్పీ ఉన్నత పాఠశాలలో, మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాల, ఆదోని ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు అలిమ్ సిద్ధికి, మల్లికార్జున, రమేష్ నాయుడు ఉపాధ్యాయులు కలం ప్రహ్లాద్, నాగరాజు, సుధాకర్, కోటన్న, కళ్యాణి పాల్గొన్నారు.

ఆదోని టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో యస్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డా. గోపినాథ్ మాట్లాడుతూ, తెలుగు భాష వ్యవహారిక శైలిపై గిడుగు రామమూర్తి చేసిన కృషిని వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. లయన్స్ క్లబ్ చైర్మన్ ప్రసాద్ రావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: తెలుగు భాషను పరిరక్షించుకుందామని జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పద్మావతి, చాముండేశ్వరి పాల్గొన్నారు.

మద్దికెర: విద్యాసాయి సంస్థలో ఎండీ యజ్ఞం వెంకటమాధవ్ తెలుగుతల్లి వేషధారణలతో చిన్నారుల చేత పద్యాలు పాడించారు. ప్రిన్సిపాల్ బాల సునిత, పీఈటీ భాస్కర్ ఉన్నారు.

ఆలూరు: మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ రాఘవరావు మాట్లాడుతూ తెలుగు భాష అన్ని భాషల్లోకీ గొప్పదన్నారు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలల్లో మోడల్ స్కూల్ తెలుగు అధ్యాపకులు, బాలకృష్ణ, సద్గురు, కరస్పాండెంట్ కేంజుండప్ప, అరికేరలో ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలల్లో ఇన్‌చార్జి హెచ్ఎం ధనలక్ష్మి, పీడీ కవిరాజు పాల్గొన్నారు.

దేవనకొండ: జడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం మద్దిలేటి పాల్గొన్నారు. అలాగే సరస్వతి, వీబీఆర్, రెయిన్‌బో పాఠశాలల్లో నిర్వహించారు.

కోసిగి: మండలంలోని పల్లెపాడు జడ్పీహెచ్ పాఠశాలలో ముఖ్య అతిథిగా డీసీసీ మాజీ చైర్మన్ పల్లెపాడు రామిరెడ్డి హాజరయ్యారు. హెచ్ఎం దస్తగిరి విజేత లకు బహుమతులు అందజేశారు. రామమూర్తి, నాగేంద్ర ప్రసాద్, నాగరాజు, వేణు, గోపాల్, శాంతన్న, శ్రీధర్, వేణుగోపాల్, ధనుంజయ్, సురేంద్ర, వెంకటేశ్, ఆనంద్, వీరేష్ ఉన్నారు.

గోనెగండ్ల: తెలుగు భాషకు గిడుగు రామూర్తి చేసిన సేవలు చిరకాలంగా గుర్తుంటాయిని సీఐ గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షహానా పర్వీన్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గౌస్ అన్నారు. మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నల్లమల పద్మావతి, దోమ విమల, గానుగ భాషా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల, రావూస్ ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహబూబ్ బాషా, రావూస్ కళాశాల సీఈఓ తిరుమలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు మూడు రోజులే అనుమతి : సీఐ

పత్తికొండ టౌన్, ఆగస్టు 29: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలకు మూడు రోజులు మాత్రమే అనుమతి ఉందని అర్బన్ సీఐ జయన్న అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్డీవో, డీఎస్పీ, అధికారుల ఆదేశాల మేరకు భక్తులు నడుచుకోవాలని కోరారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ముందుగా పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని అన్నారు.

పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మంత్రాలయం, ఆగస్టు 29: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్ గురువారం తెలిపారు. తెలిపారు. భౌతిక, రసాయన శాస్త్రం సబ్జెక్టుల్లో రెండు పోస్టులున్నాయని 50 శాతం మార్కులతో పీజీ చేసి ఉండాలన్నారు. సెప్టెంబరు 2వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9502551072ను సంప్రదించాలన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

మద్దికెర, ఆగస్టు 29: టీడీపీ నాయకులు డీఎస్పీ వెంకటరామయ్యను గురువారం కలిశారు. మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, జిల్లా సాధికారికత కన్వీనర్ ఎన్.లక్ష్మీనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు పాల్గొన్నారు.

రైతులకు అందని కరువు సాయం


నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదోని టౌన్, ఆగస్టు 29: కరువు సాయం రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ ఆరోపించారు. గురువారం పార్టీ నాయకులు సబ్ కలెక్టర్‌ను కలిశారు. దొడ్డనకేరి, నెమలికల్, జాలిమంచి గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు ఇంతవరకూ కరువు సాయం అందలేదన్నారు. తాయన్న, నెట్టేకల్ హను మంతు, లక్ష్మన్న, రుద్రముని, నరసప్ప, నీలకంఠ, ఉరుకుందమ్మా, చాకలి నర్సప్ప పాల్గొన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఆస్పరి, ఆగస్టు 29: ఆస్పరికి సమీపంలో కర్నూలు రోడ్డు వైపు ఏపీ 07టీజడ్0149 నెంబర్ గల లారీ గురువారం బోల్తా పడింది. గుంటూరు నుంచి ఆస్పరి మీదుగా కర్ణాటక రాష్ట్రం బాడిగ మార్కెట్‌కు ఎండుమిర్చి లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పగా, డ్రైవర్ బుద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. .

అధినేతను ఆదర్శంగా తీసుకోవాలి

పత్తికొండ, ఆగస్టు 29: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కార్యకర్తలకు సూచించారు. గురువారం మాట్లాడుతూ శనివారం పుచ్చకాయలమాడ గ్రామంలో పింఛన్ల పంపిణీకి సీఎం వస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం టీడీపీ అని తెలిపేందుకే సీఎం ఇంటింటి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారని అన్నారు. కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొనాలన్నారు.

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

గోనెగండ్ల, ఆగస్టు 29: లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని వీరశైవలింగాయత్ సంఘటన వేదిక జాతీయ కమిటీ సలహాదారుడు మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం గోనెగండ్లలో మాట్లాడుతూ వీరశైవులు వంద మంది ఉన్న గ్రామాల్లో ప్రత్యేక శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. కన్వీనర్ అమరేష్‌ప్ప, టౌన్ ప్రెసిడెంట్ బాబు, వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి, చిన్నరాముడు, ఎర్రిస్వామి, వేముగోడు వీరన్న, రాకేష్, వీరేష్, శిల్పి శ్రీనివాసులు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోసగించడానికే ఏకీకృత పెన్షన్ పథకం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 29: ఉద్యోగులను మోసగించడానికే కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ పథకం విధానాన్ని తెచ్చిందని ఎస్టీయూ సీనియర్ నాయకుడు మానపాటి సూర్యుడు ఆరోపించారు. గురువారం మాట్లాడుతూ, కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఏకీకృత పెన్షన్ పథకం ఉద్యోగుల పాలిట శాపంగా మారబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌కే మేకప్ వేసి ఏకీకృత పెన్షన పథకం (యుపీఎస్) తయారు చేశారన్నారు. దీనివల్ల ఉద్యోగులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, రామాంజనేయులు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, భాస్కర్, లక్ష్మణ, కోటేశ్వరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

● నియోజకవర్గాల్లో క్రీడా దినోత్సవం


క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే పార్థసారథి, క్రీడాకారులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆదోని జోన్ పీఈటీల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మున్సిపల్ క్రీడా మైదానంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, అవుట్ డోర్ స్టేడియం కోసం కృషి చేస్తానన్నారు. అక్కడ నుంచి క్రీడాజ్యోతిని పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, చైర్పర్సన్ బోయ శాంత, పారిశ్రామికవేత్త విట్టా రమేష్, గుడిసె కృష్ణమ్మ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ అనుపమ, జాతీయ వెటరన్ క్రీడాకారుడు బందే నవాజ్, పీఈటీల సంఘం నాయకులు నరస య్య, రామన్న, నరసింహారాజు, నరసింహులు, ఈరన్న, జీవన్ సింగ్, ఎల్కే చిన్నప్ప, శివారెడ్డి, నాగరాజు, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

తుగ్గలి: హెచ్ఎం విజయలక్ష్మి, పీఈటీల జిల్లా పీఈటీల సంఘం కార్యదర్శి చందు నాయక్ పాల్గొనానరు. ఉపాధ్యాయులు సుధాకర్‌గౌడు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

కోసిగి పాఠశాలకు అవార్డు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు క్రీడల్లో ఉత్తమ పాఠశాల అవార్డు అందజేసినట్లు హెచ్ఎం, పీడీ ఖలీల్ అహ్మద్ పీఈటీ శ్రీరాములకు గురువారం తెలిపారు. కర్నూలు టౌన్ మోడల్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు

ఎమ్మిగనూరు: మాచాని సోమప్ప జడ్పీ బాలికోన్నత పాఠశాల క్రీడల్లో మద్వితీయ స్థానంలో నిలించింది. ఈ మేరకు క్రీడల్లో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభకనబరచిన అవార్డులు, షీల్డ్‌లు పాఠశాలలో ప్రదర్శించారు. హెచ్ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ఏడాది పాఠశాల జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారన్నారు. ఈ ఏడాది జిల్లాలో కర్నూలు మొదటి స్థానంలో నిలువగా మాచాని సోమప్ప పాఠశాల విద్యార్థినిలు ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. పీడీలు సుజన కుమారి, నాగేశ్వరి, పాల్గొన్నారు.

రహదారి కబ్జాపై వివాదం


పోలీసుల సాయంతో బండల తొలగింపు

ఆదోని, ఆగస్టు 29: దారి కబ్జా చేసి బండలు పాతడంతో వివాదం చెలరేగింది. బాధితుల కథనం మేరకు.. అరుంజ్యోతి నగర్‌లో నివాసం ఉంటున్న తమ ఇంటికి వెళ్లే రాస్తా కబ్జా చేసి బండలు అడ్డంగా పాతారు. బాధితుడు సంజన్న అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో గుడిలో నివాసం ఉండగా బుధవారం సాయంత్రం సంజన్న మృతి చెందాడు. బండలను తొలగిస్తేనే శవాన్ని అంత్యక్రి యలకు తరలిస్తామని బంధువులు శవంతో ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, అసిస్టెంట్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎంత నచ్చజెప్పినా ససేమిరా అన్నారు. గురువారం మధ్యాహ్నం పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఘర్షణ సద్దుమనిగి సంజన్న మృతదేహాన్ని అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

సొంత గూటికి మాజీ ఎంపీటీసీ

కౌతాళం, ఆగస్టు 29: మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు గురువారం టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ తరఫున కౌతాళం ఎంపీటీసీగా పని చేశారు. అనంతరం వసీపీలో చేరారు. టీడీపీ ఇటీవల అధికారంలోకి రావడంతో గురువారం మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, మండల అధ్యక్షుడు ఉలిగయ్య ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

రేపు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

వెల్దుర్తి, ఆగస్టు 29: సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో 31న శనివారం పింఛన్లను ఎన్టీఆర్ భరోసా పంపిణీ చేయనున్నట్లు ఎంపిడివో శివమల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఉదయం నుంచే పంపిణీ ఉంటుందని గమనించాలని ఆయన కోరారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం, ఆగస్టు 29: ఉరుకుంద ఈరన్న రాజగోపుర నిర్మాణానికి గురువారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందించినట్లు డీసీ, ఈవో గురుప్రసాద్ తెలిపారు. కర్నూలుకు చెందిన యాడికి శ్రీకాంత్, వై. రమ కుటుంబ సభ్యులు రూ.1,94,000 చెక్కును సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు.

సాదాసీదాగా మండల సమావేశం

వెల్దుర్తి, ఆగస్టు 29: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడివో శివమల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల వివరాలను అధికారులు తెలియజేశారు. కాగా కొందరు మండల అధికారులు సమావేశానికి గైర్హాజర య్యారు. వారందరికీ నోటీసులు పంపిస్తామని ఎంపిడివో తెలిపారు. ఎంపీపీ రంగయ్య, జడ్పీటీసీ సుంకన్న, మాజీ ఎంపీపీ బొమ్మన సరళారవిరెడ్డి, సర్పంచి శైలజ, ఏవో అక్బర్‌బాషా, విద్యుత్‌ఏఈ రాఘవేంద్రబాబు, పంచాయతీ ఈవో నాగేశ్వరరావు, ఎంఈవో ఇందిర, ఆర్ఐ మస్తాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

● డీఈవో శామ్యూల్


భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

కోసిగి, ఆగస్టు 29: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని డీఈవో, ఇన్‌చార్జి ఆర్డీడీ శామ్యూల్ ఆదేశించారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కోరారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం పాఠశాలలో సమస్యలను హెచ్ఎం నాగేశ్వరీదేవిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈవోలు మోయినుద్దీన్, శోభారాణి, సీఆర్పీలు తదితరులు ఉన్నారు.

యాక్షన్ ప్లాన్ తయారు చేయండి..

సీఎం చంద్రబాబు సూచనల మేరకు వికసిత్ ఆంధ్ర కోసం 2024-2029 ఐదు సంవత్సరాల యాక్షన్ ప్లాన్‌ను డాక్యుమెంట్ రూపంలో చేయాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆదోనిలో భారీ వర్షం


జలమయమైన మున్సిపల్ మెయిన్ రోడ్డు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 29: పట్టణంలో గురువారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు ్ జలమయమ య్యాయి. ప్రధాన రహదారులు మెయిన్ రోడ్, రైతు బజార్ రేడియో స్టేషన్, గీతా మార్కెట్, జైన్ టెంపుల్ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, చిన్న మార్కెట్, బ్రాహ్మణ వీధి ప్రధాన రహదారులన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

మైనార్టీల పక్షపాతి సీఎం చంద్రబాబు


మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు 29: సీఎం చంద్రబాబు మైనార్టీల పక్షపాతి అని టీడీపీ ఎమ్మిగనూరు మైనార్టీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు ఉసేన్ సాబ్, తురేగల్ నజీర్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ పార్లమెంటులో వక్ఫ్ బోర్డుచట్ట సవరణ బిల్లును ఆమోదించనివ్వకుండా జేపీసీ ఏర్పాటు చేశాల చూశారని తెలిపారు. ఆలిండియా పర్సనల్ లా బోర్డు నాయకులు, ఉలేమాలు, హాఫీజ్ మైనార్టీ శాఖమంత్రి ఎన్ఎండీ ఫారుక్‌తో చర్చించారని ఆయన అన్నారు.,

బాల, బాలికలకు ప్రత్యేక క్లినిక్

కోసిగి, ఆగస్టు 29: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న కౌమార బాలురు, కిశోర బాలికల కోసం ప్రత్యేక క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ తెలిపారు. గురువారం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతూ 10 నుంచి 19 ఏళ్ల బాలబాలికలు తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్త వహించాలని, రక్తహీనత రాకుండా చూసుకోవాలని కోరారు. పది నుంచి 15 గ్రాముల రక్తం ఉండాలని, చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రాముడు, ఎంఎల్‌హెచ్‌పీ యామిని ఉన్నారు

ఎన్‌సీసీలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ కేడెట్స్

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 29 : పట్టణంలోని నెహ్రూ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్‌సీసీలో ప్రతిభ చాటారు. గురువారం ప్రతిభ చాటిన 20 మంది ఎన్‌సీసీ విద్యార్థులు సిల్వర్ పథకాలను అందుకున్నట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ అనిల్ కుమార్ తెలిపారు. అనంతపురంలో ప్రత్యేక ఎన్‌సీసీ శిబిరంలో కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన 500 మంది కాడెట్స్ వివిధ అంశాలలో 10 రోజులపాటు 9(ఏ)బెటాలియన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చినట్లు మిలటరీ శిక్షణ, శారీరక శిక్షణ, డ్రిల్ మ్యాప్ రీడింగ్, జాతీయ సమైక్యత వంటి అంశాలలో బోధించారన్నారు. పోటీలలో తమ పాఠశాల 20 మంది విద్యార్థులు సిల్వర్ పథకాన్ని సాధించారని తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఆదోని టౌన్, ఆగస్టు 29: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గురువారం పట్టణ శివారు పర్వతాపురంలో పర్యటించి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి తానే స్వయంగా పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తానని అన్నారు. ప్రజల తమ సమస్యలను, ఇబ్బందులను నేరుగా తనను కలిసి తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమీషనర్ డా. అనుపమ అసిస్టెంట్ సీటీ ప్లానర్ శ్రీనివాసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పామును పట్టుకోబోయి..

● కాటుకు గురైన బాధితుడు, ఆసుపత్రిలో చికిత్స

కోసిగి, ఆగస్టు 29: మండల కేంద్రానికి చెందిన పరుశాగేరి నర్సారెడ్డి పాములు పట్టుకోవడంలో దిట్ట. ఇప్పటికి మూడు వేలకు పైగా పాములు పట్టుకున్నాడు. గురువారం పెద్దకడుబూరు మండలం బాపులదొడ్డి గ్రామంలో ఓ ఇంట్లో నాగుపాము ఉందని సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లిన నర్సారెడ్డి నాగుపామును కట్టుకునే క్రమంలో ఆ పాము నర్సారెడ్డి చేతికి కాటు వేసింది. ఒకటి కాదు.. రెండు కాదు మూడు సార్లు చేతికి బలంగా కరవడంతో అలాగే పామును పట్టుకుని సంచిలో వేసుకుని అడవిలో వదిలి పెట్టాడు. కొద్దిసేపటికే నర్సారెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. నర్సారెడ్డి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆదోని ఏరియా ఆసుపత్రిలో నర్సారెడ్డి చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 29: పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు యుకే వీరేంద్ర గురువారం ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ముందుగా ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని బాణసంచా పేల్చారు. యుకే వీరేంద్రకు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి చేర్చుకున్నారు. అలాగే ఆయన వెంట వచ్చిన అనుచరులందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ బడుగుల ప్రభుత్వమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. సమస్యలను తనదృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరి తీవ్ర గాయాలు

కోసిగి, ఆగస్టు 29: మండలంలోని దుద్ది చెరువు సమీపంలో ఆటో బైక్ ఢీకొని ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల మేరకు.. గురువారం రాత్రి కోసిగి నుంచి బైక్‌పై ఆర్లబండకు మేకల రామాంజి, గొల్ల శ్రీరాములు వెళుతుండగా, దుద్ది నుంచి కోసిగి వస్తున్న ఆటో దుద్ది చెరువు సమీపంలో ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురు తీవ్రంగా గాయపడగా వారి పరిస్థితి విషమంగా ఉంది. 108 సిబ్బంది రామక్రిష్ణ వీరికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదోని ఔట్‌పోస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఆలూరు, ఆగస్టు 29: పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన వీరేష్‌పై గురువారం రాత్రి బోయ రంగన్న కొడవలితో దాడి చేయగా వీరేష్ తలకు తీవ్ర గాయాల య్యాయి. వీరేష్ కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు భోజనం చేశావా అని వీరేష్ అడిగినందుకు కోపోద్రిక్తుడైన బోయ రంగన్న కులం పేరుతో దూషించి వేట కొడవలితో దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు..

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఆదోని, ఆగస్టు 29: మున్సిపల్ ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశాల మేరకు రహదారికి అడ్డంగా పార్కింగ్ చేసినవారికి, వీధి వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

శాంతిభద్రతలను కాపాడాలి

తుగ్గలి, ఆగస్టు 29: శాంతిభద్రతలను కాపాడాలని టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బాలన్న విద్యాకమిటీ చైర్మన్ రవి, యాదవ్ కోరారు. గురువారం పత్తికొండ సీఐ పులిశేఖర్‌ను సన్మానించారు. బలరాముడు, మల్లికార్జున, రాజు ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల, ఆగస్టు 29: చిన్నమరివీడుకు చెందిన బోయ కృష్ణ కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

వేలంలో రూ.65 లక్షల ఆదాయం

ఆస్పరి, ఆగస్టు 29: మేజర్ గ్రామపంచాయతీ టమోటా, కూరగాయల మార్కెట్ వేలం రూ. 65 లక్షలకు పలికింది. లక్ష్మీనారాయణ దక్కించుకున్నారు. సర్పంచ్ మూలింటి రాధమ్మ, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, యూఆర్డీ రామ్మూర్తి, కార్యదర్శి జమ్మలనాయక్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

తుగ్గలి, ఆగస్టు 29: సారా స్థావరాలపై దాడులు చేసి, ఊటను ధ్వంసం చేసినట్లు తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి గురువారం తెలిపారు. సమాచారం మేరకు రాంపల్లె పరిసర ప్రాంతాల్లో దాడులు చేశామని అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు.

మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

దేవనకొండ, ఆగస్టు 29: మండలంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షికి ఎఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్ పాల్గొన్నారు.

నాడు-నేడుపై విచారణ చేయాలి

మంత్రాలయం, ఆగస్టు 29: చిలకలడోన ప్రాథమిక పాఠశాలలో చేసిన నాడు-నేడు పనులపై విచారణ చేయాలని ఆర్‌పీఎస్ఎఫ్, ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆఫ్రిది, రఘునాథ్ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలను పరిశీలించారు. మరమ్మతులకు రూ.32 లక్షల నిధులను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. నవీన్, రాజు, కాళి, రాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గోనెగండ్ల, ఆగస్టు 29: మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీఐ గంగాధర్, విద్యా కమిటీ చైర్మన్ గౌస్ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో ఉన్న బాలికల హాస్టల్ పరిశీలించారు. గానుగ బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

హొళగుంద, ఆగస్టు 29: రైతులు పంటల నమోదు, ఈకేవైసీ చేయించుకరోవాలని, ఏవో ఆనంద్ లోకాదల్ గురువారం అన్నారు. నేరణికి, చిన్నహ్యోట గ్రామాలోని పత్తి పంటను ఏఈవోతో కలిసి పరిశీలించారు.